E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA  సంపుటి : 01  సంచిక : 125 ఆదివారం, ఏప్రిల్ 12, 2026  ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్  పేజీలు: 08  వెల :05/-

## దక్షిణాది రాష్ట్రాలను
# బలహీన పరచే కుట్ర

- నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం
- 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ భట్టి



**హైదాబాద్,ఏప్రిల్ 11** దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలన్నారు. సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క.. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు . బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని మిగతా2లో...

## బెంగాల్లో తృణమూల్‌కు
# ఓటమి భయం

**అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు**

**బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ**




**కోల్‌కతా,ఏప్రిల్ 11 :** పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహి రంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదర ణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని మిగతా2లో...

## పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోడీ సంభాషణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 11 :** మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలో శనివారంనాడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రేరణా స్థల్ వద్ద నివాళు లు అర్పించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు సంభాషించు కున్నారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని అక్కడే ఉన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో బీజేపీ నేత జేపీనడ్డా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను పలకరిస్తూ ముందుకు వెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్న తరుణంలో ప్రధాని, ప్రతిపక్ష నేత పరస్పరం సంభాషించుకోవడం అందర్నీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన మిగతా2లో...



## చర్చలు విఫలమైతే ఇరాన్‌పై
# మరిన్ని దాడులు

**- మరోమారు హెచ్చరించిన ట్రంప్**

**న్యూయార్క్,ఏప్రిల్ 11** ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేరెడ్ కుష్నర్‌లు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. మిగతా2లో...

## పంటకొనుగోళ్లలో
# తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు



2లో

## బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

**కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**



**ములుగు,ఏప్రిల్ 11 :** కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే మిగతా2లో...

## పారదర్శకంగానే
# మేడారం గద్దెల నిర్మాణం

● అవినీతిపై ఆధారాలు ఉంటే చూపాలి ● సెల్‌ఫోన్ కొనుగోళ్లపైనా కువిమర్శలు తగవు ● మంత్రి సీతక్క మరోమారు గట్టిగా జవాబు



**ములుగు,ఏప్రిల్ 11 :** మేడారం సమ్మక్క-సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్దదెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నా రని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలు దేరారు. నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మిగతా2లో...

## పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం

అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ - కేంద్రమంత్రి బండి సంజయ్

2లో



## హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

**కాల్‌ఉప విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 11** యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు మిగతా2లో...

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా...
# అవి కేసీఆర్ ఎన్నికలే

● కెసిఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు ● అనేక హామీలతో డబ్బా కొట్టిన రేవంత్ ● నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

● ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 11 :** ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మిగతా2లో...

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

• అధికారికంగా ప్రకటించిన బోర్డు

2లో

## 20న మోతిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా... అవి కేసీఆర్ ఎన్నికలే

(మొదటి పేజీ తరువాయి)

నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుం టున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టు కున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తట్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

**విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం**

**అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన**



**హైదరాబాద్,ఏప్రిల్ 11 :** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతో పాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగి స్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించక పోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకు న్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్యం రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతి రావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# పంట కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

**సిద్దిపేట,ఏప్రిల్ 11 :** పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.


# పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపిం చండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**● అధికారికంగా ప్రకటించిన బోర్డు**




**హైదరాబాద్,ఏప్రిల్ 11 :** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్' అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# బెంగాల్లో తృణమూల్‌కు ఓటమి భయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోడీ సంభాషణ

(మొదటి పేజీ తరువాయి)

వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇటీవల కాలంలో పలు పబ్లిక్ స్పీచ్‌లు, రాజకీయ ర్యాలీల్లో మోదీ, రాహుల్ మధ్య విమర్శలు చోటుచేసుకున్నాయి. మోదీ రాజీపడే నేత అని, మన విదేశాంగ విధానం మోదీ పర్సనల్ పాలసీగా మారిందని, ఆయన ఏమి చేయాలో ఏమి చేయకూడదో ట్రంప్ నిర్దేశిస్తురటారని రాహుల్ విమర్శలు గుప్పించారు. రాహుల్ విమర్శలను మోదీ తిప్పికొట్టుతూ, ఆయనొక స్వయం ప్రకటిత రాజకుమారుడని చురకలు వేశారు. తాజాగా వీరిద్దరు ముచ్చటించుకోవడం ఆసక్తికర పరిణామంగా చ ఎప్పుకోవాలి.

# చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు. శుక్రవారం పెట్టిన ఓ పోస్టులో.. 'ఇరాన్ యుద్ధం చేసే దానికంటే.. ఫేక్ న్యూస్ మీడియాను, పబ్లిక్ రిలేషన్స్‌ను హ్యాండిల్ చేయటంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

(మొదటి పేజీ తరువాయి)

తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా.. ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో, సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామని అన్నారు భట్టి విక్రమార్క. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం మేము అడుగులు వేస్తున్నామన్నారు భట్టి. ఆనాడు పూలే లాంటి మహనీయులే వివక్షకు గురైనా భవిష్యత్ తరాల కోసం వారు వేసిన పునాదులే మార్గదర్శకాలన్నారు భట్టి.

# బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

# 20న మోతెలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ



**హైదరాబాద్,ఏప్రిల్ 11** జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

## కేసీఆర్ మళ్ళీ సీఎం అవుతాడని అనడం జీవన్ రెడ్డి భ్రమ: స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ నాయకుడు కొలిపాక సతీష్



**తెలుగు గళం, స్టేషన్ ఘనపూర్, ఏప్రిల్ 11**
కె. చంద్రశేఖర్ రావు మళ్ళీ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి అవుతారని చెప్పడం జీవన్ రెడ్డి భ్రమేనని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ కొలిపాక సతీష్ విమర్శించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చి మంత్రి స్థాయికి చేర్చిందని, అయినప్పటికీ పార్టీని వీడకుండా ఉండాలని మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఏఐసీసీ నాయకులు, మంత్రులు శ్రీధర్ బాబు తదితరులు సూచించినా ఆయన వినలేదన్నారు. ఈ వయస్సులో పార్టీలు మారడం సరికాదని, అయినా కూడా బీఆర్ఎస్‌లో చేరేందుకు ప్రయత్నించడం ఆశ్చర్యకరమన్నారు. కేసీఆర్ మెప్పు కోసం ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదవి నుంచి తప్పుకోవాలని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని చెప్పడం బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంపై భారీ అప్పులు మోపి, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అప్పులు ఉన్నప్పటికీ అభివృద్ధి దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి విమర్శించడం సిగ్గుచేటని కొలిపాక సతీష్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100కి పైగా సీట్లు గెలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## గర్భ నిర్ధారణ చేసి పిండస్థ శిశువును చంపడం ఘోర నేరం

- ఆడపిల్ల పుడితే తల్లిని నిందించడం మూర్ఖత్వం: ఎమ్మెల్యే నాగరాజు
- శాస్త్రీయ అవగాహన లేకనే అబార్షన్లు, హత్యలు
- ఐనోలు ఘటనపై ఎమ్మెల్యే ఘాటు స్పందన



**తెలుగు గళం న్యూస్, వర్ధన్నపేట ఏప్రిల్ 11**
వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు సమాజంలో పెరుగుతున్న ఆడపిల్లలపై వివక్షను, మూఢనమ్మకాలను తీవ్రంగా ఖండించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బిడ్డ పుట్టుకలో తల్లి పాత్ర కేవలం జన్మనివ్వడమేనని, శాస్త్రీయంగా శిశువు లింగ నిర్ధారణ పురుషుడి క్రోమోజోములపై ఆధారపడి ఉంటుందని వివరించారు. పురుషుడి వై క్రోమోజోమ్ కలిసినప్పుడే మగబిడ్డ పుడుతాడని తెలిపారు. ఈ ప్రాథమిక అవగాహన లేకుండా ఆడపిల్ల పుడితే తల్లిని నిందించడం అనర్థకమని అన్నారు. ఇటీవల ఐనోలు మండలంలో ఆడబిడ్డ పుట్టబోతుందనే కారణంతో గర్భస్రావాలు చేయించడం, పుట్టిన ఆడశిశువులను హతమార్చడం వంటి ఘటనలను ప్రస్తావిస్తూ ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గర్భ నిర్ధారణ చేసి పిండస్థ శిశువును చంపడం ఘోర నేరమని స్పష్టం చేశారు. సమాజంలో ఉన్న ఇలాంటి మూర్ఖపు ఆలోచనలను తొలగించేందుకు అంగన్‌వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామీణ స్థాయిలో గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులకు శాస్త్రీయ అవగాహన కల్పించి, ఆడపిల్లల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించండి"

- మర్లపాడు బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ ఆంధ్రయ్యా పిలుపు"




**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్11(తెలుగుగళం)న్యూస్:**
సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలో గల మర్లపాడు గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా మర్లపాడు ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ కనమాల ఆంధ్రయ్యా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన కొనసాగుతోందన్నారు. అనుభవం గల ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు 21 రకాల వస్తువులతో ప్రభుత్వం కిట్ అందజేయనున్నదని, మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సౌకర్యాలను వినియోగించుకునేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో: ప్రధానోపాధ్యాయులు ఉప్పల సత్యనారాయణ, ఉపాధ్యాయులు కోలేటి నిర్మలకుమారి, గుత్తా చంద్రశేఖర్, సీఆర్‌పీ పుల్లాచారి, అంగన్వాడి టీచర్ రమాదేవి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎంపీ డా. కడియం కావ్య

- పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు









**తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఏప్రిల్ 11**
మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. పూలే 200వ జయంతి సందర్భంగా హనుమకొండ ములుగు క్రాస్ రోడ్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, జ్యోతిరావు పూలే మహిళల అభివృద్ధి కోసం విశేష కృషి చేశారని గుర్తు చేశారు. విద్యా విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ సమాజంలో సమానత్వం కోసం ఆయన చూపిన మార్గం ఆదర్శప్రాయమని కొనియాడారు. సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక కులగణనను విజయవంతంగా నిర్వహించిందని ఎంపీ తెలిపారు. సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ అంశాలను సమగ్రంగా పరిగణలోకి తీసుకుంటూ సర్వే చేపట్టినట్లు చెప్పారు. సేకరించిన డేటాను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం ద్వారా “తెలంగాణ మోడల్” దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మరియు హనుమకొండ జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహాత్ బాజ్ పాయి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్ తదితరులు పాల్గొని మహాత్మావిగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ధర్మసాగర్ లో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు






**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/ధర్మసాగర్ ఏప్రిల్ 11**
హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సమీపంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలే 199వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ, మాచర్ల జ్యోతి ఏలియా గ్రామ సర్పంచ్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగారపు శ్రీనివాస్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే బడుగు, బలహీన వర్గాలు మరియు మహిళల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడిన మహానీయుడని పేర్కొన్నారు. సమసమాజ స్థాపనకు ఆయన చేసిన సేవలు అపారమని, కుల వివక్ష నిర్మూలన కోసం ఆయన చూపిన మార్గం భవితరాలకు ఆదర్శమని తెలిపారు. పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మాచర్ల రవి, మండల అధ్యక్షులు గుర్రపు ప్రసాద్, బీజేపీ జిల్లా నాయకులు నిమ్మ సుదర్శన్ రెడ్డి, వీఎచ్పీఎస్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు సింగారపు పవన్, మండల ప్రధాన కార్యదర్శి చిలుక రాజు, సీనియర్ నాయకులు కొట్టే శివ, పుట్ట దేవరాజ్ తదితరులతో పాటు రిపికా మహేష్, మల్లేపల్లి అనిల్, బొక్క రమేష్, కొట్టె విజయ్ పాల్గొన్నారు.

## సామాజిక న్యాయాన్ని విస్మరించి అంతరాలను పెంచుతున్న పాలకులు

- వర్గ సామాజిక పోరాటాలే దోపిడికి ప్రత్యామ్నాయం
- ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్
- ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి




**తెలుగు గళం న్యూస్ వరంగల్ ఏప్రిల్ 11**
సామాజిక ఆర్థిక అంతరాలను పెంచి పోషించే మనువాద భావజాలంతో విధానాలను రూపొందిస్తూ పెట్టుబడిదారులకు పాలకులు ఊడిగం చేస్తూ సామాజిక న్యాయాన్ని రాజ్యాంగాన్ని తుంగలో తొక్కారని ఎంసిపిఐ(యు)జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఈరోజు మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా ఎంసిపిఐ(యు) ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా పోరాడి దళితులకు మహిళలకు చదువు హక్కుగా ఉండాలని ఆచరణలో తన భార్యని మొదటి పంతులమ్మగా తీర్చిదిద్ది పాఠశాల నెలకొల్పి మహిళలకు దళితులకు చదువు నేర్పించిన గొప్ప సాంఘిక సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని జమీందారులకు వ్యతిరేకంగా రైతులను కూడగట్టి హక్కుల కోసం పోరాడిన గొప్ప సామాజిక విప్లవకారుడు పూలే అని మనుషుల మధ్య కుల మత ప్రాంత విభేదాలు లేకుండా సమాన హక్కులతో జీవించాలని పరితపించిన సామాజిక యోధుడు పూలే అని ఆయన త్యాగాలు ఆదర్శాలు నేటి తరాలకు ఎంతో అనుసరణీయమని పేర్కొన్నారు. కానీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనువాద భావజాలాన్ని చాప కింద నీరులా వ్యాపింప చేస్తూ రాజ్యాంగాన్ని నీరుగార్చి కులమత ప్రాంత విభేదాలను రెచ్చగొట్టి ప్రజల మనోభావాలను దెబ్బతీస్తూ వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తూ ప్రజా సమస్యలను విస్మరించి పాలన కొనసాగిస్తూ అధికారమే పరమావధిగా రాజకీయాలు చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంతరాలు లేని సమాజం నిర్మించడానికి సామాజిక వర్గ పోరాటాలను బలోపేతం చేసి ప్రత్యామ్నాయని చూపాలని అందుకు కమ్యూనిస్టు వామపక్ష సామాజిక ప్రజా సంఘాల కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి సింగతి సాంబయ్య రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కన్నం వెంకన్న జిల్లా నగర సహాయ కార్యదర్శులు నర్ర ప్రతాప్ సుంచు జగదీశ్వర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ముక్కెర రామస్వామి నగర నాయకులు ఐతమ్ నాగేష్ గణిపాక ఓదెలు ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర జిల్లా కార్యదర్శులు గడ్డం నాగార్జున చుక్క ప్రశాంత్ జిల్లా నగర నాయకులు పాల్గొన్నారు.

# ఆధునిక సమాజపు కాంతిరేఖ జ్యోతిరావు పూలే

**- అసమానతల అంతానికి ఆయన కృషి చిరస్మరణీయం**

**- కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి**







**తెలుగు గళం న్యూస్ నల్గొండ, ఏప్రిల్ 11**

దేశంలో వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న సామాజిక అసమానతలను విద్య అనే ఆయుధంతో ఎదుర్కొని, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే ఆధునిక సమాజపు కాంతిరేఖ అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పేర్కొన్నారు. శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని పెద్ద గడియారం సెంటర్‌లో ఉన్న జ్యోతిబా పూలే విగ్రహం వద్ద ఆయన 199వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాలడుగు నాగార్జున మాట్లాడుతూ, 19వ శతాబ్దంలో భారతదేశంలో సామాజిక మార్పుకు పూలే చేసిన సేవలు అపారమని తెలిపారు. సంఘసంస్కర్తగా, ఆలోచనాపరుడిగా ఆయన తన జీవితాన్ని కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి అంకితం చేశారని చెప్పారు. మహిళా విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషి విశేషమని, 1848లో పూణేలో తొలి బాలికల పాఠశాలను స్థాపించడం ఆయన గొప్ప సేవగా పేర్కొన్నారు. సత్యశోధక్ సమాజ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని అన్నారు. వితంతువుల పునర్వివాహాలు, వృద్ధుల కోసం శరణాలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపట్టి సమాజంలో సమానత్వం స్థాపనకు కృషి చేశారని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో అట్టడుగు వర్గాలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని, బలహీన వర్గాల హక్కులను హరించుతోందని విమర్శించారు. పూలే ఆశయాల సాధన కోసం అట్టడుగు వర్గాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ గంజి మురళీధర్, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ ఎంకన్న, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండ అనురాధ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సైదులు, మల్లెపాక వెంకన్న, అయితగోని జనార్ధన గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన బడి బాట కార్యక్రమంలో ఉత్సాహభరితంగా ప్రవేశాల ప్రచారం





**ధర్మసాగర్, తెలుగు గళం ఏప్రిల్ 11:**

ధర్మసాగర్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలన బడి బాట కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ధర్మసాగర్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రవేశాల ప్రచారం వేగంగా సాగుతోంది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి జ్యోతి ఎలియా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయుల సమక్షంలో ప్రవేశాల ప్రకటన పత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాలని, ధర్మసాగర్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రవేశాలు పెంచేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. తదనంతరం ఉపాధ్యాయులు ధర్మ ప్రకాశ్, కవితా దేవి, సురేష్, రాజమ్మ, రామకృష్ణ, రమ్యశ్రీలు ధర్మసాగర్ బాలికల ప్రాథమిక పాఠశాల మరియు బాలుర ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి సిబ్బందితో చర్చలు జరిపారు. విద్యార్థులకు ప్రవేశాల ప్రకటన పత్రాలను పంపిణీ చేసి, ఐదవ తరగతి పూర్తి చేస్తున్న విద్యార్థులను బాలుర ఉన్నత పాఠశాలలో చేరేందుకు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచే దిశగా సానుకూల వాతావరణం ఏర్పడింది.

# జఫర్గఢ్‌లో రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం







**జఫర్గడ్, ఏప్రిల్ 11**

తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జఫర్గడ్ మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కార్యదర్శి నక్క యాకయ్య ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రైతు సంఘం జనగాం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య హాజరై మాట్లాడారు. 1936లో ఆవిర్భవించిన రైతు సంఘం అప్పటి నుంచి రైతుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తూ రైతాంగానికి అండగా నిలుస్తోందని తెలిపారు. భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా రైతు సంఘాన్ని మరింత బలోపేతం చేసి రైతుల హక్కుల సాధనలో ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వడ్లకొండ రాజు, పులిగిల్ల నాగరాజు, ఎండి శంషుద్దీన్, నల్లతీగల శ్రీను, వేల్పుల ఐలయ్య, రాపర్తి మల్లేష్, సోమయ్య, ఎల్లమ్మ, యాదగిరి, రాయపురం బిక్షపతి, శారద, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగించాలి!


**- జక్కి అనిత శ్రీకాంత్ నల్లబెల్లి గ్రామ సర్పంచ్**



**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/ఏప్రిల్ 11**

వరంగల్ జిల్లా: వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం స్త్రీల కోసం దేశంలో ప్రథమంగా పాఠశాలను స్థాపించి విద్య వ్యాప్తి ద్వారా ధ్యాస విముక్తిని చేసేందుకు కుల వివక్షను సాంఘిక దోపిడిని మూఢనమ్మకాలను కేంద్ర బిందువైన బ్రాహ్మణ ఆధిపత్యాన్ని బద్దలు కొట్టేందుకు తిరుగుబాటు బావుటాను ఎగరవేసిన తొలితరం సాంఘిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని అన్నారు, 1948లో దేశంలోనే మొదటిగా బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేసి 1964లో వితంతువుల కోసం బాల హత్య ప్రతి బంధం గృహాలను ఏర్పాటు చేసి 1973 సెప్టెంబర్ 24న సత్యశోధ సమాజ్ స్థాపించి స్థాపించి దేశంలో శూద్రులను బ్రాహ్మణుల చెర నుండి కాపాడడం కోసం దేశంలో మొట్టమొదట సంస్కరణోద్యమానికి నాంది పలికిన మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, వార్డు సభ్యులు దుగ్గాల వాసుదేవరావు, బిర్రు సవిత చంద్రయ్య, ముత్యం రేణుక స్వామి, ఎలబోయిన సదానందం, మార్కెట్ డైరెక్టర్ మల్యాల దేవేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు మొహమ్మద్ జాఫర్ మియా, శ్రీపాది శ్రీనివాస్, తాటికాయల సురేష్, బిర్రు ఎల్లయ్య, జనపరెడ్డి రవీందర్ రెడ్డి, వడ్డే నారాయణ, కిరణ్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే కి వెంటనే భారతరత్న అవార్డు ప్రకటించాలి: బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నగేష్ ముదిరాజ్ అల్టిమేటం







**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఏప్రిల్ 11**

మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ముషీరాబాద్ మరియు అంబర్‌పేట్ ప్రాంతాల్లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నగేష్ ముదిరాజ్ పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, కుల వివక్ష నిర్మూలన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మహిళా విద్యా విస్తరణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాబోయే 2027లో జరిగే పూలే 200వ జయంతి ఉత్సవాల కంటే ముందుగానే కేంద్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిరావు పూలే కి భారతరత్న పురస్కారం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ వర్గానికి చెందిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పూలే పట్ల గౌరవాన్ని చాటుతూ ఈ నిర్ణయం తీసుకోవాలని కోరారు. కుల నిర్మూలన, సమానత్వం, మహిళల సాధికారత కోసం పూలే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘసంస్కర్త అని ఆయన పేర్కొన్నారు.

# పర్వతగిరిలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు**

**- పూలే ఆశయాలను కొనసాగించాలని పిలుపు**

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ఏప్రిల్ 11**



వరంగల్ జిల్లా:పర్వతగిరి లో మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పర్వతగిరి మండల మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు పిలుపునిచ్చారు. శనివారం పర్వతగిరి మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను వివిధ ప్రజా సంఘాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మెడిశెట్టి రాములు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకున్న వర్ణ వివక్ష నిర్మూలనకు, దళిత, బహుజన మహిళలల విద్యాభివృద్ధికి పూలే చేసిన కృషి అమోఘమని కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన పడిన తపన, చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జూలపెల్లి గంగాధర్ రావు నాయకులు సురేందర్ రావు, కంటెం సుధాకర్, సందేల నవీన్, వార్డ్ మెంబర్ రంగు వెంకన్న స్వేరో వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి గారె జయరాజ్ పర్వతగిరి అంబేద్కర్ సంఘం నాయకులు చిన్నపెల్లి దేవేందర్, బోట్ల వెంకట్, బోట్ల కుమార్, చిర్ర సునీల్ , ఆకులపెల్లి యాకుబ్, పసుల హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా ప్రజా సమస్యల సర్వేకు సిపిఎం సిద్ధం



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఏప్రిల్ 11**

ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ తెలిపారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో శనివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఉప సర్పంచ్ లింగనబోయిన రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మునిగెల రమేష్ మాట్లాడుతూ, గ్రామంలో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించేందుకు ఈ నెల 13 నుంచి 16 వరకు ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబాన్ని కలిసేలా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. సర్వేలో గుర్తించిన సమస్యలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం అవసరమైన పోరాటాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, తోడెంగల ఐలయ్య, కుర్ర ఉప్పలయ్య, మంద మహేందర్, శాఖ కార్యదర్శులు మరియు నాయకులు నెలమంచ రాంరెడ్డి, దాసరి కొమురయ్య, రామగోని సతీష్, గోడిశాల యాదగిరి, సట్ల రాజు, ద్దైద కుమార్, లింగనబోయిన కుమార్, మేదరవైన కరుణాకర్, లింగనబోయిన శ్రీకాంత్, మంద మొగిలి, అన్నెపు రాజు, నీరటి సంపత్, కాసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

**- సామాజిక న్యాయం,మహిళా విద్య కోసం పూలే చేసిన సేవలకు నివాళులు**



**తెలుగు గళం న్యూస్ సిద్దిపేట హుస్నాబాద్ కోహెడ**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, కంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బస్వారాజ్ శంకర్ హాజరై మాట్లాడుతూ, మహాత్మ జ్యోతిరావు పూలే ఒక ప్రముఖ సంఘ సంస్కర్తగా, మహిళా విద్యా ఉద్యమ పితామహుడిగా, కుల వివక్ష వ్యతిరేకిగా నిలిచారని పేర్కొన్నారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించిన పూలే సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం విశేషంగా కృషి చేశారని తెలిపారు.పూలే తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళలు, అణగారిన వర్గాలకు విద్య అందించేందుకు కృషి చేసి సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికారని అన్నారు.కుల వివక్షను నిర్మూలించేందుకు 1873లో సత్యశోధక్ సమాజ్ స్థాపించి సామాజిక అసమానతలపై పోరాటం సాగించారని వివరించారు.ఆయన చేసిన సేవలను గుర్తించి ప్రజలు “మహాత్మా”గా గౌరవించారని తెలిపారు.పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఆయన ఆశయాలను స్మరించుకుని,వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.సమానత్వం,మహిళా సాధికారత, విద్యా విస్తరణ కోసం ఆయన చూపిన మార్గం నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, మాజీ సర్పంచ్ దొమ్మట జగన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర జాక్ కన్వీనర్ మంద మల్లేశం, వార్డు సభ్యుడు గుగ్గిళ్ల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తిప్పారాపు నాగరాజు, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల జాన్, సామాజిక కార్యకర్త డా. వేల్పుల జయశంకర్, అరె జగదీశ్, బందెల రాజమౌళి, గ్రామ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ నేత, వ్యాపారవేత్త చేరాల మనోహర్, కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ నాయకులు సన్నత్ రెడ్డి, పొన్నాల మోహన్, సవనపల్లి అశోక్, యాదగిరి, అడ్వకేట్ జెరిపోతుల కిరణ్ కుమార్, కూరెళ్ల సాయికిరణ్, కాయిత రామదాస్, బండ సుమన్ యాదవ్, మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కమల్ మిత్ర మోటార్స్‌లో భారీ ఎక్స్ఛేంజ్ మేళా”




**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రిల్11(తెలుగుగళం)న్యూస్:** ద్విచక్ర వాహనాల కొనుగోలుదారులకు శుభవార్త. సత్తుపల్లిలోని కమల్ మిత్ర మోటార్స్‌లో ఏప్రిల్ 15, 16, 17, 18 తేదీల్లో భారీ ఎక్స్ఛేంజ్ మేళాను నిర్వహించనున్నారు.పాత వాహనాలను ఇచ్చి కొత్త బైక్ కొనుగోలు చేసే వారికి ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.ఈ మేళాలో భాగంగా పల్సర్ 125 మోడల్‌పై రూ.14,999 వరకు డౌన్ పేమెంట్, పల్సర్ 150 మోడల్‌పై రూ.19,999 వరకు డౌన్ పేమెంట్ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తక్కువ డౌన్ పేమెంట్‌తో సులభ వాయిదాలపై వాహనాలు అందించనున్నట్లు వెల్లడించారు.వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కమల్ మిత్ర మోటార్స్‌ను సంప్రదించాలని సూచించారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం -- ఆదర్శంగా నిలిచిన దంపతులు

**తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 11**

జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారామపురం గ్రామంలో హృద్యమైన సేవా కార్యక్రమం నిర్వహించబడింది. ఫ్రెండ్లీ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరగోని లక్ష్మణ్--స్వాతి దంపతుల పదకొండవ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రేమ సదన్ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు అన్నదానం చేశారు.ఈ సందర్భంగా 20 మంది వృద్ధులకు భోజనం, బ్రెడ్‌లు, అరటిపండ్లు, శీతల పానీయాలు పంపిణీ చేశారు. దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా వృద్ధులకు భోజనం వడ్డించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి కుమార్తె ప్రంజన, కుమారుడు సత్యశ్రేయన్ కూడా సేవలో భాగమై వృద్ధులకు భోజన పళ్లెట్లు అందించారు.ఫౌండేషన్ అధ్యక్షులు పెదపూడి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ఫౌండేషన్ సేవా కార్యక్రమాల



ప్రభావంతో ప్రేరణ పొందిన లక్ష్మణ్ కుటుంబం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని తెలిపారు.వీరగోని లక్ష్మణ్ మాట్లాడుతూ, తాను ఫౌండేషన్‌కు ఎల్లప్పుడూ తోడ్పాటునిస్తూ ప్రతి నెలా వెయ్యి రూపాయలు పేదల సేవకు వినియోగించాలనే సంకల్పంతో ఉన్నానని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా తాను ఎంతో సంతృప్తి పొందినట్లు తెలిపారు.ఆశ్రమ నిర్వాహకులు బ్రహ్మచారి మాట్లాడుతూ, ఫౌండేషన్ ద్వారా ప్రతి వారం వృద్ధులకు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత మంది దాతలు ముందుకు రావాలని ఆకాంక్షించారు.ఇలాంటి శుభదినాలను వృద్ధాశ్రమాలలో సేవా కార్యక్రమాల రూపంలో జరుపుకోవడం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తుందని వారు పేర్కొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**- పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం**

**- పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయనిధి నిధులు అందిస్తామన్న ఎమ్మెల్యే నాగరాజు**

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/ఏప్రిల్ 11**

వరంగల్ జిల్లా :వర్ధన్నపేట పట్టణ కేంద్రం లోని ఎం ఎం ఆర్ గార్డెన్స్ నందు వర్ధన్నపేట పట్టణ, వర్ధన్నపేట మండలానికి కి సంబంధించిన 38 మంది లబ్ధిదారులకు 38,00,000 రూపాయలు (38 లక్షల 4 వేల 408 రూపాయలు) విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మరియు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా 58 మందికి రూ.14, 11,000 (14 లక్షల 11 వేల రూపాయలు) విలువైన చెక్కులను గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ....తెలంగాణ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ఆర్థిక ఇబ్బందులు



తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోందని చెప్పారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని, రాష్ట్రంలో రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.మహిళ ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. అర్హులైన పేద ప్రజలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.గతంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసిన సంఘటనలు జరిగాయని, ప్రస్తుతం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎవరికీ ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకులను హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలను పూర్తిగా పారదర్శకంగా అందజేస్తామని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణగిరి జెడ్పీపీ ఎస్ పాఠశాలలో సర్పంచ్ ఆకస్మిక తనిఖీ



**ధర్మసాగర్ తెలుగు గళం ఏప్రిల్ 11**

ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామంలోని జెడ్పీపీ ఎస్ పాఠశాలను గ్రామ సర్పంచ్ రేణుక--కుమారస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, బోధన విధానం, హాజరు వివరాలు, మౌలిక సదుపాయాలను సమగ్రంగా పరిశీలించారు.ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలిస్తూ వంటగది పరిశుభ్రత, ఆహారం నాణ్యత, మెనూ



ప్రకారం వంట జరుగుతున్నదా అనే అంశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి, నాణ్యతపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆహారం నాణ్యంగా ఉండేలా, పిల్లలకు ఆరోగ్యకరమైన భోజనం అందించేలా సిబ్బందికి సూచనలు చేశారు.అలాగే తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధన విధానాన్ని గమనించారు.విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి ప్రతి విద్యార్థి క్రమంగా పాఠశాలకు హాజరవ్వేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో శుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థుల భవిష్యత్తు బలోపేతం కావాలంటే పాఠశాలలు సక్రమంగా పనిచేయాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని తెలిపారు.ఈ తనిఖీలో ఉపసర్పంచ్ వల్లేపు సంధ్యా రాజీమారెడ్డి, వార్డు సభ్యుడు రావుల సతీష్ రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా అధికారి చంద్రు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ రందన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ రందన్ మాట్లాడుతూ గంగాదేవిపల్లి గ్రామంలా మన ఊరు కూడా అభివృద్ధి చెందాలని, పరిశుభ్రత, క్రమశిక్షణలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.

# సామాజిక ఉద్యమాల తొలి తరం గొంతుక జ్యోతిబాపూలే

**సత్తుపల్లి డిపోలో ఘనంగా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు**



**సత్తుపల్లి,ఆర్ సి,ఏప్రియల్11(తెలుగుగళం)న్యూస్:**

సామాజిక ఉద్యమాల తొలితరం గొంతుక జ్యోతిబాపూలే అని సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం సత్తుపల్లి డిపోలో జ్యోతిబాపూలే 199 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చత్రపాటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల చైతన్యానికి ప్రతీక, సమానత్వం కోసం నిరంతరం పోరాడిన మహాత్ముడు జ్యోతిబాపూలే అని అన్నారు. సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మహనీయుడు జ్యోతిబాపూలే అని ఆయన కొనియాడారు. గొప్ప విద్యావేత్త, సంఘసంస్కర్త మహిళలకు విద్యను అందించడంలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయుడు జ్యోతిబాపూలే అని ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను డిపో మేనేజర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ సభ్యులు సైదిరెడ్డి, పద్మావతి, కాంతారావు, ఏడీసీలు వెంకటయ్య, బాల స్వామి, ఎం వి కుమార్, జగన్నాథం, ఎర్నింగ్ సెక్షన్ బిసి విక్కీ, టైర్ ఎడిసి రమేష్, స్టేషన్ మేనేజర్





ఆనందం, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ నారాయణ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు

■ ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర అంగన్వాడీలదే

■ పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ సులభతరం

■ పిల్లలను స్వంత బిడ్డలుగా చూసుకోవాలి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట అర్బన్/ఏప్రిల్ 11



వరంగల్ జిల్లా: వర్ధన్నపేట నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎంఎంఆర్ గార్డెన్స్ నందు వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వర్ధన్నపేట పట్టణ, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలకు చెందిన 150 మంది అంగన్వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేసిన అనంతరం నియోజ కవర్గ ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడు తూ.పిల్లలకు పౌష్టికాహారం అందిం చడంతో పాటు ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. చిన్నారులకు అత్యధిక పోషక విలువలు కలిగిన బాలామృతం అందిస్తున్నట్లు చెప్పారు. మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ స్కూల్స్ ఏర్పాటు చేసి చిన్నారులకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు అనుబంధంగా ప్రీ స్కూల్స్ నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడిం చారు.అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల పోషణ, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.అంగన్వాడీ టీచర్లకు అందజేస్తున్న మొబైల్ ఫోన్ల ద్వారా పోషణ్ ట్రాకర్ యాప్ సహాయంతో పిల్లల ఆరోగ్య వివరాలు, పోషకాహార కార్యక్రమాల సమాచారాన్ని సులభంగా నమోదు చేసి పై అధికారులకు పంపే అవకాశం కలుగుతుందని చెప్పారు. దీంతో సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు అందుతాయని పేర్కొన్నారు.గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్యమైన బాధ్యత అంగన్వాడీ సిబ్బందిదేనని, వారి సేవలను ప్రభుత్వం గుర్తిస్తూ అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నదని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. పిల్లల ఆరోగ్యం,పోషకాహారం మరియు మహిళల సంక్షేమం పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.అంగన్వాడీ సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డి డబ్లూ ఓ,సిడిపిఓ, సూపర్వైజర్లు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆర్థిక సహాయం



తెలుగు గళం న్యూస్ జనగామ ఏప్రిల్ 11

జనగామ జిల్లా నర్మెట మండలం,కన్నెబోయినగూడెం గ్రామంలో నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హం సాత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బి.ఆర్.ఎస్ మైనార్టీ నాయకులు మహమ్మద్ యాకుబ్ పాష తమ వంతు సహకారంగా రూ. 5,016 నగదును గ్రామస్తులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాలను ప్రతిబింబించేలా సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన జరగడం గొప్ప విషయమని, ఇది యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.గ్రామ పెద్దలు, యువకులు ఆయన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

# ఇళ్లకు సౌరవిద్యుత్ వేస్తే విద్యుత్ మాత్రమే కాదు - 40 శాతం రాయితీ ఇస్తున్న కేంద్రం



దేశంలోని ప్రజలకు విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం నివాస గృహాలపై సౌర విద్యుత్తు యూనిట్లు ఇస్తోంది. ఇదే తరహాలో దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లకు సోలార్ పలకలను అందించాలని నిర్ణయించింది. దీనికి తగిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. దీనిలో ప్రధానంగా నెలకు 360 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు అవకాశం కల్పిస్తోంది.యూనిట్? ఏర్పటుకు 40 శాతం రాయితీ : సాధారణంగా దీనిని ఏర్పాటు చేయాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని ప్రతి ఒక్కరూ వెనకడుగు వేస్తారు. ఈ విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం ప్రజలను సోలార్? శక్తిని ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి యూటనిట్ అమర్చుకునేందుకు 40 శాతం రాయితీ ఇస్తోంది. దీనిలో భాగంగా తెలంగాణలోనూ ప్రతి జిల్లాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు పీఎం సూర్యఘర్ ముఫ్త్? బిజిలీ యోజన ప్రచార రథాలను ప్రారంభించి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.80 చదరపు అడుగుల స్థలం చాలు : దీనిని ఏర్పాటు చేసుకునేందుకు 80 చదరపు అడుగుల స్థలం ఉంటే సరిపోతుంది. దీనిలో కిలో వాట్?కు సరిపడ సౌర విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిని ఏర్పాటు చేసుకునేందుకు సాధారణంగా రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అవుతుంది. అయితే దీనిపై ప్రభుత్వం రాయితీ ఇస్తున్నందున మనకు కేవలం రూ.30 నుంచి రూ.40 వేలలోపు పని పూర్తవుతుంది. అంటే ప్రభుత్వం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి రూ. 30 వేల వరకు రాయితీ ఇస్తుంది. దీనిలో మనకు అనేక లాభాలున్నాయి. ముందుగా నెలకు రూ. 346 విలువైన విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు.2 కిలో వాట్ల యూనిట్? ఏర్పాటు చేస్తే : అధికంగా విద్యుత్?ను వినియోగిస్తాం అనుకునేవారు 2 కిలో వాట్ల యూనిట్?ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికోసం మీ వద్ద 160 చ.అ. స్థలం అందుబాటులో ఉండాలి. దీనిని పూర్తిగా ఏర్పాటు చేసుకునేందుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ప్రభుత్వం మనకు రాయితీ కల్పిస్తున్నందున కేవలం రూ.90 వేలతో పూర్తి చేసుకోవచ్చు. అనగా రూ.60 వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీనిని ఏర్పాటు చేసుకోవడంతో నెలకు రూ.1,328 విలువైన విద్యుత్తును ఆదా చేసుకోచ్చు.ఇదే రీతితో 3 కిలోవాట్ల యూనిట్?నూ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది. దీనికోసం 240 వేల చ.అ. విస్తీర్ణం ఉంటే సరిపోతుంది. దీనిని ఏర్పాటు చేసుకునేందుకు రూ.2.10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే ప్రభుత్వం అందిస్తున్న రాయితీ కారణంగా కేవలం రూ.1.22 లక్షలకు పూర్తవుతుంది. అంటే రాయితీగా రూ.78 వేల వరకు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. దీనిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా రూ.2,330 వివలవైన విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు.అర్హతలివే : దీనకోసం అప్లైచేసుకునేందుకు ఈ అర్హతలు ఉంటే సరిపోతుంది. ముందుగా మీరు భారత పౌరులై ఉండచేసుకోవచ్చు.2 కిలో వాట్ల యూనిట్? ఏర్పాటు చేస్తే : అధికంగా విద్యుత్?ను వినియోగిస్తాం ాలి. మీ ఇంటి పైకుతే దీనిపై ప్రభుత్వం రాయితీ ఇస్తున్నందున మనకు కేవలం రూ.30 నుంచి రూ.40 వేలలోపు పని పూర్తవుతుంది. అంటే ప్రభుత్వం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి రూ. 30 వేల వరకు రాయితీ ఇస్తుంది. దీనిలో మనకు అనేక లాభాలున్నాయి. ముందుగా నెలకు రూ. 346 విలువైన విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు.2 కిలో వాట్ల యూనిట్? ఏర్పాటు చేస్తే : అధికంగా విద్యుత్?ను వినియోగిస్తాం అనుకునేవారు 2 కిలో వాట్ల యూనిట్?ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికోసం మీ వద్ద 160 చ.అ. స్థలం అందుబాటులో ఉండాలి. దీనిని పూర్తిగా ఏర్పాటు చేసుకునేందుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ప్రభుత్వం మనకు రాయితీ కల్పిస్తున్నందున కేవలం రూ.90 వేలతో పూర్తి చేసుకోవచ్చు. అనగా రూ.60 వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీనిని ఏర్పాటు చేసుకోవడంతో నెలకు రూ.1,328 విలువైన విద్యుత్తును చేసుకోవచ్చు.2 కిలో వాట్ల యూనిట్? ఏర్పాటు చేస్తే : అధికంగా విద్యుత్?ను వినియోగిస్తాం ఆదా చేసుకోచ్చు.ఇదే రీతితో 3 కిలోవాట్ల యూనిట్?నూ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది. దీనికోసం 240 వేల చప్పుపై సోలార్ యూనిట్? ఏర్పాటు చేసుకునేందుకు అనువైన ప్రదేశం ఉండాలి. మీ ఇంటికి విద్యుత్? కనెక్షన్? కూడా ఉండాలి. అయితే గతంలో సౌర పలకలపై రాయితీ పొంది ఉంటే ఈ పథకానికి మీరు అర్హులు కారు.ప్లై చేసుకునే విధానం : ముందుగా అధికారిక వెబ్?సైట్? ను సందర్శించాలి. దీనిలో మీ బ్యాంకు ఖాతా వివరాలు, మీ ఇంట్లోని విద్యుత్? బిల్లు, క్యాన్సిల్? చెక్?తో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మీ అప్లికేషన్?ను డిస్కం సంస్థ పరిశీలిస్తుంది. వీలైనంత త్వరగా అనుమతి ఇస్తుంది. అనంతరం సౌర విద్యుత్?తు పలకలు, ఇన్వర్టర్? నుంచి రీడింగ్? మీటర్? ఏర్పాటు చేస్తారు. మీకు ఇష్టం ఉంటే గ్రిడ్?కు అనుసంధానం చేసుకోవచ్చు. అదనంగా ఉత్పత్తి చేసి గ్రిడ్?కు ఇస్తే మీటర్? రీడింగ్? ఆధారంగా ఉన్న వారు యూనిట్?కు రూ.2.54 చొప్పున చెల్లిస్తారు.

# గులాంగిరీని రూపుమాపడమే పూలేకు ఇచ్చే ఘన నివాళి

- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు












బోనకల్,ఏప్రియల్11(తెలుగు గళం) న్యూస్: అందరూ సమాన అవకాశాలు పొందగలిగే సమాజం కోసం పోరాడడమే మహాత్మా జ్యోతిరావు పూలే కు ఇచ్చే నిజమైన నివాళి అని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. స్థానిక షైన్ హైస్కూల్లో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో నేటి విద్యావిధానం – రావలసిన మార్పులు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి గుగులోతు నరేష్ అధ్యక్షతన జరిగిన సెమినార్ లో పల్లా కొండలరావు మాట్లాడుతూ రెండు వందల ఏండ్ల క్రితం గులాం గిరీ అనే పుస్తకం రచించి కులం పేరుతో బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా పోరాడి మహాత్ముడిగా పూలే నిలిచారన్నారు. మనసుల్లో బానిస భావజాలం నశించి ఆధిపత్య వర్గాలకు గులాం గిరీ చేయకుండా శక్తివంతులుగా ఎదగాలంటే విద్యను ఆయుధంగా వాడాలని పూలే చెప్పారన్నారు. తొలిసారిగా మహిళల కోసం పాఠశాల ప్రారంభించారని గుర్తు చేశారు. తన జీవిత భాగస్వామిని తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా నిలిపాడన్నారు. ఎన్నో అవమానాలు, దాడులను ఎదుర్కొని సావిత్రీబాయి పూలే నిలవబట్టే నేడు బాలికలు ధైర్యంగా విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారన్నారు. సత్యశోధక్ సమాజ్ ను స్థాపించి కుల ఆధిపత్యంపై, మూఢ నమ్మకాలపై, మహిళా విద్య కోసం, మనిషి శక్తివంతుడిగా ఎదగడం కోసం విద్య అవసరమేమిటన్న దానిపై రచనలు, పోరాటాలు చేస్తూ స్వయంగా పాఠశాలలు నిర్వహించారని తెలిపారు. మతంలో ఉన్న మానవీయ విలువలు కొనసాగిస్తూ మూఢత్వం, ఆధిపత్యం, దోపిడీ, పీడన, కుల వివక్షతలపై పోరాడేలా నేటి విద్యార్థులు కృషి చేయాలన్నారు. రాజ్యాంగ అధ్యయనంతో పాటు ఆచరణలో జరుగుతున్న లోపాలను విద్యార్థులు గ్రహించి చైతన్యం పెంచుకోవాలన్నారు. సిలబస్ లో శాస్త్రీయ అంశాలు పెంచేందుకు అందరం కలిసి పోరాటం చేయాలన్నారు. కేవలం మార్కుల కోసం బట్టీ పట్టకుండా ప్రకృతిని ప్రజలను కాపాడుకోవడం కోసం అంతరాలు, దోపిడీ, ఆధిపత్యం లేని సమాజం కోసం కృషి చేయడం ద్వారా పూలే వంటి మహనీయుల కలలను సాకారం చేద్దామన్నారు. తొలుత పెద్దబీరవల్ల సర్పంచ్ చింతలచెరువు కోటేశ్వరరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ శ్వేత, సిఐటియు జిల్లా నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ మెంబర్ దేగల వేలాద్రి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పూలే కు పూలతో నివాళులు అర్పించారు. పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు, పెద్దబీరవల్లి సర్పంచ్ చింతలచెరువు కోటేశ్వరరావులను షైన్ హైస్కూల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

# వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న కీర్తి రెడ్డి

- ప్రజల సుఖశాంతులు,రైతుల సుభిక్షం కోసం ప్రార్థనలు






జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో నిర్వహించిన శ్రీ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ చందుపట్ల కీర్తి రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కీర్తి రెడ్డి మాట్లాడుతూ, శ్రీ వేణుగోపాల స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. జిల్లాలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు భక్తి భావాన్ని మరింత బలపరుస్తాయని తెలిపారు.కళ్యాణ మహోత్సవాన్ని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల రాజు,మండల ఉపాధ్యక్షుడు శివకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్,సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి,నాయకులు గణేష్, రాకేష్, శంకర్ తదితరులు,స్థానిక కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరంగల్ శివారులో సెల్ టవర్లలో బ్యాటరీలు దొంగిలింపు - ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులు




**వరంగల్ :** సెల్ టవర్ల మరమ్మతులపై పరిజ్ఞానం వారికి ఉంది. ఈ విద్యను బతుకు తెరువుకు ఉపయోగించుకుంటే బాగానే ఉండేది. కానీ బుద్ధి ఊరుకుంటుందా తమ కబ్బిన విద్యతో సెల్ టవర్లలో బ్యాటరీల చోరీకి పాల్పడడం మొదలుపెట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 140కి పైగా బ్యాటరీలను గుట్టుచప్పుడు కాకుండా దొంగిలించి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఓ వైపు చెరువుల్లో చేపలుదొంగలిస్తూనే ఇంకో వైపు బ్యాటరీలు దొంగతనం చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్న వీరి ఆగడాలకు వరంగల్ పోలీసులు కళ్లెం వేసి అరెస్ట్ చేశారు.
రూ.1.98 లక్షలు విలువైన బ్యాటరీలు స్వాధీనం : వరంగల్ శివారు ప్రాంతాల్లోని సెల్ టవర్లలో ఇటీవల కాలంలో బ్యాటరీలు మాయం అవుతున్నాయి. ఏం జరుగుతుందో ఎలా పోతున్నాయో ఎవ్వరికీ తెలియరాలేదు. చివరకు పోలీసులు నిఘా పెట్టి బ్యాటరీ దొంగల ముఠాలోని ఐదుగురిని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పట్టుకున్న నిందితుల నుంచి దాదాపుగా రూ.1.98 లక్షలు విలువ గల 144 సెల్ టవర్ బ్యాటరీలు, రూ.2.60 లక్షల నగదు, రెండు ట్రాలీలు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వరంగల్ శివారులో సెల్ టవర్లలో బ్యాటరీలు దొంగిలింపు - ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసిన పోలీసులుసులభంగా డబ్బు సంపాదించాలని : పోలీసులు అరెస్టు చేసిన నిందితులంతా నల్గొండ జిల్లాకు చెందిన వారే. నల్గొండకు చెందిన కొంపల్లి గణేశ్ (27), బొంగరాల సుధాకర్ (30), తన్నీరు శివాజీ (26), బీమనబోయిన నరసింహ (31), గడగోజు సురేశ్? (25)లు ప్రధాన నిందితులుగా పోలీసులు గుర్తించారు. ఇందులో గణేశ్? డ్రైవర్ కాగా మిగితా వారంతా గణేశ్? దోస్తులు. వీరికి జనరేటర్ మరమ్మత్తులు చేయడం సెల్ టవర్ పనులపై వీరికి పరిజ్ఞానం బాగా ఉంది. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో వీరంతా ముఠాగా ఏర్పడ్డారు. సెల్ టవర్లకు వినియోగించే బ్యాటరీల్లోని అపహరించడం వృత్తిగా ఎంచుకున్నారు."ఈ కేసులో నిందితుల్లో గణేశ్ నల్గొండ? జిల్లా టెలికాం మేనేజర్? వద్ద డ్రైవర్?గా పని చేస్తున్నాడు. బొంగరాల సుధాకర్ జనరేటర్లు రిపేర్ చేస్తాడు. శివాజీ సెల్ టవర్స్?కి డీజిల్? సప్లై చేస్తాడు. వీరందరికీ వీటిపై అనుభవం ఉండటంతో సులువుగా దొంగతనాలు చేశారు. అన్నీ దొంగిలిస్తే అనుమానం వస్తుందని రెండు మూడు బ్యాటరీలను దొంగిలించేవారు. వీటిని మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో విక్రయించేవారు. డైలీ చెకింగ్? ఉండకపోవడం, కేవలం రెండే బ్యాటరీలు మిస్ కావడంతో ఎవరికీ అనుమానం రాలేదు" – సన్ ప్రీత్ సింగ్, వరంగల్ నగర పోలీస్ కమిషనర్ఒకటి రెండు బ్యాటరీలను మాత్రమే చోరీ : మొత్తం బ్యాటరీలను అపహరిస్తే టవర్లు పనిచేయక అధికారులకు ముందే అనుమానం వస్తుంది. టవర్లలో ఒకటి రెండు బ్యాటరీలను మాత్రమే దొంగలించేవాళ్లు. ఇక్కడ చోరీ చేసి మహారాష్ట్రలోని గచ్చిరోలి ప్రాంతంలో విక్రయించి వచ్చిన డబ్బుతో ముగ్గురు నిందితులు జల్సాలు చేసేవారు. ఇదే సమయంలో చెరువుల్లో చేపలను చోరీలకు పాల్పడే మిగితా ముఠా సభ్యులు సైతం వీరితో జత కట్టారు. ఈ ముఠా సభ్యులు చేపలు చోరీలకు పాల్పడే సమయంలోనే బ్యాటరీలు చోరీ చేసేందుకు అనుకూలంగా ఉన్నసెల్ టవర్లను గుర్తించిన సెల్ టవర్లలోని బ్యాటరీలను చోరీలకు పాల్పడేవారు. అలాగే చెరువుల్లో చోరీ చేసిన చేపలను నల్గొండలో తక్కువ ధర విక్రయించేవారు.వివిధ జిల్లాల్లోనూ : ఈ తరహాలో నిందితులు వరంగల్ కమిషనరేట్, యాదాద్రి, నల్గొండ, సూర్యపేట జిల్లాల్లో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సెల్ టవర్ బ్యాటరీ చోరీలకు పాల్పడ్డారు. గత నెల మార్చి 3వ తేదీన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ ప్రాంతంలోని సెల్ టవర్ల నుంచి 48 బ్యాటరీలు చోరీ చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత అధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టగా వీరి గుట్టు రట్టైంది. పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని ముఠా సభ్యులను గుర్తించిన పోలీసులు నిందితుల కదలికలపై నిఘా పెట్టారు. పక్కా సమచారంతో వీరందరినీ అరెస్ట్ చేశారు. నిందితులు ఇచ్చిన సమచారంతో పోలీసులు చోరీ సోత్తు స్వాధీనం చేసుకున్నారు.

# డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో వాహనాలు సీజ్ చేయొద్దు.. తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు



తెలంగాణ హైకోర్టు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు కచ్చితంగా రవాణాశాఖ నిబంధనల్లోని 44ఏను అమలు చేయాలని ఆదేశించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన సమయంలో.. ఒకవేళ ఎవరైనా మద్యం తాగి డ్రైవర్ చేస్తున్నట్లు తేలితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు పెట్టొచ్చని, కానీ వాహనాన్ని సీజ్ చేసే అధికారం మాత్రం లేదని కోర్టు తెలిపింది. డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వ్యక్తిని నిబంధనల ప్రకారం ప్రాసిక్యూషన్ చేయాల్సి వస్తే మూడు రోజుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది.
సాయిరాం రావు అనే వ్యక్తి 2025లో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిపోయారు.. అయితే పోలీసులు ఆయన వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఆ వాహన యజమాని విజయ్ హైకోర్టును ఆశ్రయించారు.. పోలీసులు వాహనాన్ని సీజ్ చేయడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్.. మోటారు వాహనాల చట్టం ప్రకారం మద్యం తాగి నడుపుతున్నారన్న కారణంతో వాహనాన్ని సీజ్ చేసే అధికారం పోలీసులకు లేదని చెప్పారు. ఆ వాహనానికి సంబంధించిన తగిన పత్రాలు చూపిస్తే విడుదల చేయాలన్నారు. ఒకవేళ వాహనం స్వాధీనం చేసుకుంటే.. ఆ వాహన యజమానికి సంబంధించిన ఆర్‌సీ, డ్రైవింగ్‌ల లైసెన్స్ వంటివి చూపితే తిరిగి అప్పగించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.
డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిపోయిన వ్యక్తి వాహనాన్ని నడపడానికి వీల్లదేని.. ఆ వ్యక్తితో పాటు ఉండేవారిలో మద్యం తాగని, , లైసెన్స్ ఉన్న వారికి ఆ వాహనం అప్పగించాలని కోర్టు తెలిపింది. ఒకవేళ మద్యం మత్తులో ఉన్న వ్యక్తి పక్కన ఎవరూ లేకపోతే, బంధువులు, స్నేహితుల్ని పిలిచి వారికి వాహనం అప్పగించాలని ఆదేశించారు. ఒకవేళ ఎవరూ లేని పక్షంలో మాత్రమే ఆ వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించాలని సూచించారు. డ్రైవర్ మద్యం సేవించడానే కారణంతో వాహనాన్ని సీజ్ చేసే అధికారం పోలీసులకు లేదన్నారు. పోలీసులు తెలంగాణ మోటర్ వెహికిల్ రూల్స్ 1989ను కచ్చితంగా పాటించాలని సూచించారు.

# ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సంఘీభావం

**సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి డిమాండ్**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం చెల్పూర్ కేటీపీపీ వద్ద ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కార్మికులకు సంఘీభావం తెలిపారు.సమ్మె ప్రదేశాన్ని సందర్శించి కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ఆర్టిజన్ కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.కార్మికులతో తక్షణం చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉప ముఖ్యమంత్రిగా ఉన్న భట్టి విక్రమార్క ఆ శాఖకు మంత్రిగా ఉన్న నేపథ్యంలో కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పేర్కొన్నారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వం ఆలస్యం చేయకుండా ఆర్టిజన్ కార్మికులతో చర్చలు జరిపి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని,లేనిపక్షంలో కార్మికులతో కలిసి తాము కూడా ఉద్యమంలో పాల్గొని మద్దతు ఇస్తామని హెచ్చరించారు.ఈ సందర్భంగా కార్మికులు తమ సమస్యలను వివరించి త్వరిత పరిష్కారం కోరారు.సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో పరిస్థితిని ప్రభుత్వం గంభీరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**సమానత్వం,విద్యా విస్తరణకు పూలే సేవలు చిరస్మరణీయం--ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా** కేంద్రంలోని ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,మహాత్మా పూలే సమాజంలో సమానత్వం స్థాపనకు,విద్యా విస్తరణకు అపార కృషి చేసిన మహనీయుడని పేర్కొన్నారు.ఆయన ఆలోచనలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు.సమానత్వం,సామాజిక న్యాయం సాధనలో ప్రతి ఒక్కరూ పూలే చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.మహాత్మా పూలే తన జీవితాన్ని అణగారిన వర్గాల అభివృద్ధికి అంకితం చేసి,విద్య ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని కృషి చేశారని తెలిపారు.ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు,మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, బీసీ అభివృద్ధి అధికారి ఇందిర, బీసీ సంఘాల ప్రతినిధులు సత్యనారాయణ, తిరుమలచారి, భద్రయ్య, సంపత్, సతీష్, ఇతర బీసీ సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ వేడుకలు ద్వారా మహాత్మా పూలే ఆశయాలను స్మరించుకోవడంతో పాటు సమానత్వం,విద్యా ప్రాధాన్యతపై ప్రజల్లో మరింత చైతన్యం పెరిగిందని తెలిపారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి--యువతకు కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపు

**- భూపాలపల్లిలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ,2కే రన్ నిర్వహణ**






**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించేందుకు శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా,హెల్త్ వీక్ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.రాజీవ్ చౌక్ నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సర్కిల్ వరకు జరిగిన ఈ ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ,యువత చదువు మరియు క్రీడలపై దృష్టి సారించి తమ భవిష్యత్తును సుస్థిరంగా నిర్మించుకోవాలని సూచించారు.మాదకద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు.ప్రస్తుతం డ్రగ్స్ సమస్య సమాజానికి పెద్ద ముప్పుగా మారిందని, ముఖ్యంగా యువత ఈ వ్యసనాలకు లోనవుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.డ్రగ్స్ వ్యసనగ్రస్తుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా డీ-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందని, భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా త్వరలో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ,ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్‌లో ఆరో రోజున మాదకద్రవ్యాల నివారణపై ఈ ర్యాలీ నిర్వహించామని తెలిపారు.డ్రగ్స్ రవాణా,విక్రయం,వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ జీవితాలను సవ్యంగా మలుచుకోవాలని సూచించారు.ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా "ఈగల్ టీం" ఏర్పాటు చేసి కఠినంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ,డ్రగ్స్ నివారణ కోసం పోలీస్ శాఖ గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.జిల్లాలో గంజాయి రవాణాదారులు,విక్రేతలపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.యువత సరదాగా డ్రగ్స్ వినియోగించడం ప్రారంభించి తర్వాత దానికి బానిసలవుతున్నారని,అవగాహన వచ్చేసరికి జీవితాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.డ్రగ్స్ నియంత్రణకు పోలీస్ శాఖ పటిష్ట నిఘా ఏర్పాటు చేసిందని,ప్రజలు బాధ్యతగా సమాచారం అందించాలని కోరారు.ప్రజల సహకారంతోనే డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని తెలిపారు.ర్యాలీ అనంతరం నిర్వహించిన 2కే రన్‌లో విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. మధుసూదన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ పావని, కౌన్సిలర్లు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి ప్రోత్సాహం లభించిందని అధికారులు తెలిపారు.



# ఎమ్మెల్యే అసమర్థత వలన బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యం

- బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతతో చేయాలి
- వట్టే వాగు పైన నాగారం గ్రామములో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ నర్సంపేట (ప్రతినిధి ) ఏప్రిల్ // 11

నాగారం గ్రామం నెక్కొండ మండల కేంద్రానికి దూరంగా ఉండటం, వట్టే వాగు పైన బ్రిడ్జి లేకపోవడంతో అత్యవసర పరిస్థితులు ఉన్నప్పుడూ చాలా ఇబ్బంది పడి చాలా మంది మరణించడం జరిగింది. నాగారం గ్రామ ప్రజలు నెక్కొండ మండల కేంద్రానికి రావడానికి కూడా చుట్టూ తిరిగి రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు.

వట్టే వాగు మీద నాగారం, ఇంటికన్నె గ్రామాల మధ్య చెక్ డ్యాంతో కూడిన బ్రిడ్జి నిర్మాణం కావాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కి ప్రత్యేకంగా శాసనసభ్యుడిగా నేను, ఆనాటి మండల ప్రజా ప్రతినిధులు, మండల పార్టీ, కోరడంతో నాడు హామీ ఇవ్వడం జరిగింది.ఇచ్చిన హామీ నీ నిలబెట్టుకుని 20 కోట్ల రూపాయలతో నాగారం గ్రామ సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కోసం ఆనాడే నిధులు తీసుకవచ్చి , టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిశీచి పనులను ప్రారంభించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉద్దేశపూర్వకంగా పనులను జాప్యం చేయడం, కాంట్రాక్టర్ పేరు మార్చి, కాంట్రాక్టర్ కు సంబంధించినటువంటి, పేర్లు మారిన తరువాత తిరిగి ఈ పనులను ప్రారంభించారు. నాణ్యతా తో కూడిన పనులను చేయించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కోరుతున్నాను. వరంగల్ జిల్లాల్లో మారుమూల ప్రాంతం, జిల్లా కలెక్టర్ గారు దీనిని స్వయంగా పరిశీలించి, పనుల పురోగతి మీద కూడా జిల్లా కలెక్టర్ గారు సమీక్షించాలి, సకాలంలో పనులు పూర్తి చేయాలి. ఈ సీజన్ లో వట్టె వాగు బ్రిడ్జి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుక రావాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. చెన్నారావుపేట మున్నేరు వాగు పైన,చిన్న కోర్పులు, పెద్ద కోర్పోలు, 20 కోట్ల రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం పనులు ఆనాడే అనుమతులు తీసుకువచ్చి టెండర్ల ప్రక్రియ పూర్తిచేయడం జరిగింది.ఆ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తుంది బిఆర్ఎస్ పార్టీ నెక్కొండ మండలం లో ఈ రెండు అత్యంత ప్రాధాన్యత ఉన్న పనులు, వేలాది మంది ప్రజలకు దాదాపుగా 15, 20వేల ప్రజలకు ఉపయోగ పడే అటువంటి ప్రాధాన్యత పనులుగా అనాడే కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి సకాలంలో నిధులు ఇచ్చారు.ఇవన్నీ చూస్తుంటే కేసీఆర్ గారు ఈ ప్రాంత ప్రజలకు గుర్తోస్తున్నారు, నాగారం గ్రామ ప్రాంత ప్రజలు కేసీఆర్ గారికి అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్ గటిక అజయ్ కుమార్, నెక్కొండ మండల బి ర్ స్ పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య, సీనియర్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, తాటిపెల్లి శివ కుమార్, మాజీ మార్కెట్ చైర్మన్ గుంటుక సోమయ్య,సీతారాంపురం సర్పంచ్ కట్కూరి నరేందర్ రెడ్డి, మండల నాయకులు కారింగుల సురేష్ గౌడ్, దేవానబోయిన విరభద్రం,నాగారం గ్రామ పార్టీ అధ్యక్షులు కేతిరెడ్డి శ్యామ్ రెడ్డి, మాజీ సర్పంచ్లు శీలం వెంకన్న,జల్లే సుదర్శన్,మాజీ పార్టీ అధ్యక్షులు కూరపాటి నగేష్,వార్డు సభ్యులు పోనాకంటి స్వామి, మాజీ ఉప సర్పంచ్ అటికే సుభద్ర బిరస్వామి, సమ్మెట సత్యనారాయణ,రాకేష్,జంగిలి రాములు, దారపు మల్లేష్, ఉంద్రాతి నాగయ్య, పోరుగు లింగన్న,మరియు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# గేటెడ్ కమ్యూనిటీ



రోడ్డుకిరుపక్కలా పంటలతో ఏపుగా పెరిగిన పొలాలు నిండు గర్భిణిలా కళకళలాడుతున్నాయి. ఎండ పెళపెళలాడుతోంది. పొలాలలో మనుషుల సందడి లేదు, చకచకా పైరులోంచి వరినితీసే యంత్రాల చప్పుడు తప్ప. యంత్రం.. కోసిన పనల నుంచి వడ్లు లోపల వేసుకుని, గడ్డిని పొలంలో వదిలేస్తోంది.. స్వార్థంతో పనిచేసే రాజకీయనాయకుడిలా. పోగేసిన ధాన్యం యంత్రంలోంచి ట్రక్ద్వారా గట్టు మీదికి వస్తోంది. గట్టు మీద జత మనుషులు ధాన్యాన్ని కాళ్లతో, చేతులతో ఎడంగా పరుస్తూ తడియారబెడుతున్నారు. బాగా ఎండిన ధాన్యాన్ని గోనెసంచిలోకి ఎత్తి మూటలు కడుతున్నారు.“పురుషోత్తం బావా! నిన్ను చూస్తే నాకు తెలియకుండానే అసూయ పుట్టుకొస్తోంది” అంటూ పొలం గట్టుమీద పొడవాటి చేతికర్ర గెడ్డానికి ఆనించుకుని నిలబడ్డ కృష్ణమూర్తి చెప్పాడు.

మధ్యమధ్యలో పనిచేస్తున్న వాళ్లని పశువుల్ని అదిలించినట్లు అదిలిస్తున్నాడు.“నా దగ్గర అంత యవ్వారం ఏముంది బావా?” “మేమంతా మిషన్లు పెట్టి వ్యవసాయం చేస్తూంటే, నువ్వు మనుషులతోనే చేస్తావు” “ఒకరోజులో మనుషులు చేసే పని మిషన్ గంటల్లో చేస్తుంది. యంత్రం కిరాయి ఒకరి జేబులోకే వెళ్తుంది. నలుగురు మనుషులు కష్టం చేస్తే వచ్చే కూలీపైసలు నాలుగు కుటుంబాల కడుపు నింపుతాయి. ఎద్దులుగా మారాల్సిన గిత్తలు.. అచ్చోసిన ఆబోతులు అయిపోతున్నట్లు, పొలం పనులు మర్చిపోతే జనం యంత్రాలు అయిపోతారనే భయంగా ఉంది బావా! ఏదైనా మీరు కాలంతో నడుస్తున్నవాళ్లు, నేను వెనుకబడ్డ సత్తెకాలం మనిషిని” పురుషోత్తం మధ్యతరగతి రైతు. చదువుకున్నవాడు. ఊర్లో ఇంకా చదువుకున్న వాళ్లున్నా.. కాగితం చదవాలన్నా, రాయాలన్నా పురుషోత్తమే కావాలి. కారణం.. మనిషి నిదానస్తుడు. నమ్మకస్తుడు. చెప్పింది వింటాడు, చెప్పినట్లు చేస్తాడు. తలలో నాలుకలాంటి వాడు. ఊరు–వాడ సమస్య ఏదైనా పురుషోత్తం పరిష్కారం చెప్పవలసిందే.“అవును బావా! ఎమ్మెల్యే గారిని కలిశారుగా, మన ఊరిలో రోడ్లు ఎప్పుడు వేస్తారని చెప్పారు. జనం బాగా ఇబ్బంది పడుతున్నారు” “రోడ్డు పడుతుందనే అంటారు. ఎన్ని ఎలక్షన్లు చూడలేదూ! రోడ్లు పడేదాకా పనులు ఆగుతాయా?”.. అప్పుడే అటుగా సైకిలు మీద వెళ్తున్న మరిడయ్య పురుషోత్తాన్ని చూసి ఆగాడు. సైకిలు పక్కగా ఆపుకొని పొలం వైపు వచ్చాడు.“పురుసోత్తం బాబూ! నేను, మా ఇంటిది రేతిరంత మీరు సేసిన సాయం తలుసుకుంటూనే ఉన్నాం. అమ్మాయి కడుపులో బిడ్డ అడ్డం తిరిగింది. ఆలస్యమైతే తల్లి, బిడ్డ దక్కేది కాదన్నారు డాట్టరుగారు. మీ దయ..” అంటూ కాళ్ల మీద పడబోయాడు.“చూడు మరిడయ్యా! భగవంతుడి దయ. నా దగ్గర కారున్నదీ, గుమ్మం ముందు కవరేసుకుని పెట్టుకుందుకు కాదు. అవసరానికి పనికి రావాలి. ఈరోజు నీకు పయోగపడింది. అంతేకాదు.. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారంటే సంతోషమేగా!” అంటూ మరిడయ్యను వారించాడు.“వత్తాను బాబూ! పిల్లకి పత్తెం బువ్వ పట్టుకెలుతున్నా” అంటూ వెళ్లిపోయాడు మరిడయ్య.“చూశావా బావా! ఇప్పుడైనా అర్థమైందా? నువ్వంటే ఎందుకు అసూయో? నీలాగా చేద్దామనుకుంటే నా వల్ల కావటంలేదు” అన్నాడు కృష్ణమూర్తి. “అదేంలేదు బావా! అవసరమైతే నువ్వు ఇంతకంటే ఎక్కువ చేస్తావు. చేసావు కూడా! మీ చెల్లాయి, నేను వచ్చేవారం సిటీకి వెళ్తున్నాం. నేను వచ్చేదాకా నువ్వే చూసుకోవాలి. నీకు తెలుసుగా, శివ కోటిన్నర పెట్టి ఇల్లు కొన్నాడు. గృహప్రవేశానికి వెళ్లాం. మొత్తం ఇల్లంతా పూర్తయిన తర్వాత మళ్లీ చూడలేదు. రమ్మని ఒకటే గోల!” “కోటిన్నరే...?” ఆశ్చర్యపోయాడు కృష్ణమూర్తి.“రేటు వింటే మనకి చుక్కలు కనిపిస్తున్నాయి. బ్యాంకు అప్పు నెలనెలా వాయిదాలు కట్టినప్పుడు వాడు చుక్కలు చూస్తాడు” “మరీ కోతలు పని..” “అందుకేగా పది మందిని ఎక్కువ పెట్టుకుని మరీ పూర్తి చేస్తున్నాను. నేను వెళ్లేలోపు ధాన్యం నూర్పు పూర్తి చేసి, ఒబ్బిడి చేసేస్తా. షావుకారుతో రేటు మాట్లాడి పెట్టాను. మాల్ కాటాకి ఎత్తడమే! ఆ పని నువ్వు చూసుకోవాలి” “ఓస్! అదేముందిలే. అలవాటైన పనేగా, చిటికెలో చేస్తా. నాకో అనుమానం..”ఆగిపోయిన కృష్ణమూర్తి వైపు చెప్పమన్నట్లు చూశాడు పురుషోత్తం.

“అదే బావా! కోట్లు పోసి కొనే అంత ఆ ఇంట్లో ఏముంటుందా!? అని”“గేటెడ్ కమ్యూనిటీట..” “అంటే..” “అందులోనే మంగలి షాపు, మందుల షాపు, సూపర్ మార్కెట్ ఉంటాయి. డాక్టర్ క్లినిక్, పిల్లల ఆటస్థలం, పెళ్లిళ్లు–పేరంటాలు చేసుకోవడానికి మండపం, స్నానాలకు చెరువంత స్విమ్మింగ్ పూల్, వినోదానికి సినిమా హాల్, గ్రంథాలయం, గుడి, బడి ఇలాంటివి ఇంకా ఏవేవో చెప్పాడులే! వెళ్లాలంటే యజమాని అనుమతి లేకుండా సెక్యూరిటీ టీం లోపలకి పంపించరు” “ఇవన్నీ ఒక్కడికే?” అమాయకంగా అడిగాడు కృష్ణమూర్తి.

“అక్కడుండే వేయి కుటుంబాల కోసం. అందులో మావా డిదొకటి. అలా కలిసి జీవించడంలో ఆనందమే వేరు” “మన ఊరికంటే పెద్దదన్నమాట, చెపుతుంటేనే చూడాలనిపిస్తోంది” “దానికేం బావా! వెళ్దాంలే”ఆ మాటకే వెళ్లినంత ఆనందపడిపోయాడు కృష్ణమూర్తి.సూర్యుడు పడమటి దిక్కులోకి వెళ్లిపోవడంతో పనులు ఆపి, కోసిన ధాన్యం మీద నల్లటి టార్పాలిన్లు కప్పి ఇళ్లకు వెళ్లిపోయారు.

పది ఫ్లాట్స్ ఉండే అపార్ట్మెంట్లోంచి పదివందల ఫ్లాట్స్ ఉండే గేటెడ్ కమ్యూనిటీలోకి వెళుతుంటే.. గుడిసెలోంచి రాజమందిరంలోకి వెళ్తున్న ఫీలింగ్. వచ్చిన వాళ్లందరినీ గేటు దగ్గర ఆపి, విచారించి మరీ లోపలికి పంపించే సెక్యూరిటీ. వచ్చేపోయే వాహనాలకు ప్రత్యేకంగా తెరుచుకునే గేట్లు. ఏ కారు ఎక్కడ పార్కింగ్ చేయాలో నెంబర్తోసహా చూపించే బోర్డ్స్. ఒకవైపు నుంచి లోపలికి వెళితే మరోవైపు నుంచి బైటికి రావాలి. ఈ ఏర్పాట్లు పురుషోత్తానికి బాగా నచ్చాయి.ఇంటిలోకి వెళ్లే ముందే తల్లిదండ్రులకి అక్కడున్న సౌకర్యాలు, పరిసరాలన్నీ చూపించాడు శివ. అక్కడ మార్నింగ్ వాక్ కోసం వేసిన మార్గం చూస్తే టన్నులకొద్దీ బద్దకం ఉన్న వాళ్లకైనా నడవాలనిపిస్తుంది. ఇంట్లోకి అడుగుపెడితే విశాలమైన హాల్. జారిపోయే టైల్స్ ఫ్లోరింగ్, స్లయిడింగ్ డోర్స్, ఇంట్లో వస్తువు ఏదీ కనిపించకుండా లోపలే దాచుకునే ఎత్తయిన కప్బోర్డ్స్. ఇద్దరికీ ఇల్లు బాగా నచ్చేసింది.“శివా! ఇల్లు, చుట్టుపక్కల వాతావరణం చాలా బాగుందిరా. ఇంతమంది జనమే మన బలం. ఈ జనంతో కలిస్తే అద్భుతాలు సృష్టించచ్చు. మంచి పని చేశావురా. చాలా ఆనందంగా ఉంది” అని అక్కున చేర్చుకున్నాడు.

తెల్లారకముందే పాల పాకెట్స్, పేపర్.. రెండూ గుమ్మం ముందు వచ్చి వాలాయి. స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్ లాంటి డెలివరీ వాళ్ల సందడి గట్టిగా ఉంది. బాల్కనీలో కూర్చుని మంద్రంగా గుడి నుంచి వచ్చే పాటలు వింటూ, స్కూల్కి వెళ్లే పిల్లల కోసం వచ్చే బస్సులు, వ్యానులు. మార్నింగ్ వాక్ చేసే పెద్దలు, పరుగులు తీసే యువకులని చూస్తూ నాలుగు రోజులు బాగానే కాలక్షేపం అయింది. కృష్ణమూర్తి ఊరి నుంచి ఫోన్చేసి.. ధాన్యం బస్తాలు కాటాకి వేసేశామని, షావుకారు మొత్తం పైకం ఖాతాలో వేస్తానన్నాడని చెప్పాడు. దాంతో కాస్త ఊపిరి పీల్చుకున్నాడు పురుషోత్తం.క్రమేపి పురుషోత్తానికి అక్కడ జీవనశైలి అర్థమౌతోంది. ఇంతమంది ఉన్నచోట రోజువారీ పనుల్లో ఉరుకులు, పరుగులు తప్ప ఉత్సాహం లేదు. పలకరింపులు లేవు. అందరూ.. ‘నన్ను ముట్టుకోకు నామాల కాకి’లా ఉన్నారు.


ఆ రోజు రాత్రి కొడుకుని పిలిచి.. “శివా! ఎదురు గుమ్మంలో ఉండేదెవరు?” అని అడిగాడు. వాళ్లెవరూ పరిచయంలేదని చెప్పాడు శివ.“పోనీ పక్క ఫ్లాట్స్ వాళ్లు తెలుసా?”“ముస్లింలో, క్రిస్టియన్లో అనుకుంటా” “నేనడిగింది.. కులం, మతం కాదు. ఇక్కడికి వచ్చి చాలా రోజులైంది. చుట్టుపక్కలవాళ్లు తెలియదంటే ఆశ్చర్యంగా ఉందిరా”“నాన్నా! ఒకరి అవసరం మరొకరికి ఉండదు. దానికంటే ముందు అసలు సమయమే ఉండదు. వీకెండ్స్ వాళ్ల ఔటింగ్లో వాళుంటారు. మా ప్రోగ్రాం మాది” చాలా తేలికగా చెప్పాడు కొడుకు.పురుషోత్తానికి మతిపోయింది. “మీరంతా కలిసి వినాయకచవితిలాంటి పండుగలు చేసుకోరా?” “చేసుకుంటాం. దాని కోసం కమిటీ ఉంది. వాళ్లు చేస్తారు. చందాలు అడిగితే ఇవ్వాలనుంటే ఇస్తారు. లేకపోతే లేదు. సింపుల్” చిన్న విషయంలా చెప్పాడు.పురుషోత్తానికి అక్కడ బంధాలు, సంబంధాల మీద పూర్తి అవగాహన వచ్చింది. వేల కుటుంబాల మధ్య జీవితం వెన్నెలగా ఉంటుందని భావించిన లలంతమంది మధ్య ఉండి అనుభవించే ఒంటరితనం గురించి మిత్రుడు కృష్ణమూర్తికి ఫోన్లో చెప్పాడు.పెట్టేలా చేసాయి. కమ్యూనిటీలో సంచలనవార్తగా పాకిపోవడంతో పొద్దునే వాకింగ్ చేసేవాళ్లు, యువకులు పురుషోత్తాన్ని హీరోలా చూసారు. ఇక్కడ జరిగింది కృష్ణమూర్తికి చెపితే.. ‘ఎక్కడికి వెళ్లినా మా బావ హీరోనే’ అని సరదాగా వేళాకోళం చేశాడు.దిగమింగుకుని ఆయన భార్య వెంబడిస్తోంది. చెదిరిపోయిన మనసుతో అనుసరించాడు పురుషోత్తం. ఫ్రీజ్ బాక్స్లో శవాన్ని పడుకోబెట్టి ఆసుపత్రి స్టాఫ్ వెళ్లిపోయారు. ఆమె ఒంటరి అయ్యింది.

# అంగరంగ వైభవంగా గడిపల్లి వేణుగోపాల స్వామి కళ్యాణం

- భక్తుల రద్దీతో కళకళలాడిన ఆలయం
--అన్నప్రసాదం,రామరసం పంపిణీ









తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలోని గడిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది.శుభ ముహూర్తంలో నిర్వహించిన ఈ కళ్యాణాన్ని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు.ఆలయ చైర్మన్ జిట్ట రామకృష్ణ ఆధ్వర్యంలో, కమిటీ సభ్యులు గంగుల రాజు రెడ్డి, నామాల రమేష్, గోగుల అశోక్ రెడ్డి, ముష్కి రమేష్ తదితరులు సమగ్ర ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, కూర్చునే సదుపాయాలు, దర్శన ఏర్పాట్లు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.కళ్యాణ మహోత్సవంలో భక్తులు తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని,కళ్యాణాన్ని కనులారా వీక్షించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి రెడ్డి,బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి,రేగొండ సర్పంచ్ వారణాసి మౌనిక అంజి, ఉప సర్పంచ్ వెల్దండి నరేష్,జిల్లా నాయకులు నాయినేని సంపత్ రావు, మేకల బిక్షపతి, మోడమ్ ఉమేష్ గౌడ్, జిల్లా మార్కెట్ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, మాజీ ఎంపీటీసీ పట్టెం శంకర్, సీనియర్ నాయకులు కట్టంగూరు మనోహర్ రెడ్డి,పెద్దంపల్లి గ్రామ సర్పంచ్ రఘు,వార్డ్ మెంబర్లు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా సాగింది.వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.అలాగే సాయి భక్తులు ఓదెల మల్లయ్య ఏర్పాటు చేసిన రామరసం పంపిణీ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.రేగొండ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగా,ఆలయ కమిటీ సభ్యుల కృషిని భక్తులు ప్రశంసించారు.

# ఏజెన్సీలో మట్టి మాఫియా దందా

- అధికార పార్టీ అండతో చెలరేగుతున్న అక్రమ దందా
- ఎమ్మెల్యే అండ ఉంది. మీరేం చేసుకుంటారో చేసుకోండి
- గిరిజనులను బెదిరిస్తున్న అధికారులు. ఆగ్రహిస్తున్న సంఘాలు
- పర్యవేక్షణ కరువు. పాతాళానికి పడిపోతున్న భూగర్భ జలాలు

తెలుగు గళం న్యూస్ నర్సంపేట ఏప్రిల్ // 11

వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని రాజుపేట గ్రామంలో ఏజెన్సీ ప్రాంతంలో ప్రకృతి వనరుల దోపిడీ పతాక స్థాయికి చేరింది. కాపాడాల్సిన వారే భక్షకులుగా మారి గిరిజన భూములను గుల్ల చేస్తున్నారు. రాజుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని గార్లగడ్డ తండాలో సాగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. అధికారుల అండదండలు, అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతుండటంతో గిరిజన సంఘాలు నిప్పులు చెరుగుతున్నాయి. అధికారి అహంకారం.. ప్రజాస్వామ్యం అపహాస్యం మట్టి తవ్వకాలను ప్రశ్నించిన సామాన్య ప్రజలపై కొందరు అధికారులు జులుం ప్రదర్శిస్తున్నారు.మాకు ఈఈ పర్మిషన్ ఉంది. ఎమ్మెల్యే అండ ఉంది. మీరేం చేసుకున్నా మాకేం కాదు అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానమివ్వడం గమనార్హం. ప్రజాప్రతినిధుల పేర్లు వాడుకుంటూ చట్టాన్ని చుట్టచుట్టేస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి, గిరిజన హక్కులను కాలరాస్తున్న వైనంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి మట్టి గండం విచక్షణారహితంగా సాగుతున్న ఈ తవ్వకాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. సారవంతమైన గిరిజన భూములు పనికిరాకుండా పోతుండగా, భూగర్భ జల మట్టం భారీగా పడిపోతోంది. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని పౌర సంఘాలు హెచ్చరిస్తున్నాయి. పీసా చట్టం, 1/70 చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు మాఫియాతో చేతులు కలపడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని గిరిజన నేతలు ప్రశ్నిస్తున్నారు. ఉద్యమిస్తాం. హెచ్చరికఅధికార పార్టీ బలంతో గిరిజనులను భయపెట్టాలని చూస్తే సహించేది లేదు. తక్షణమే అక్రమ తవ్వకాలను నిలిపివేయాలి. నిబంధనలు అతిక్రమించిన వారిపై, వారికి సహకరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో ఐటీడీఏ పరిధిలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతాం. ప్రభుత్వం స్పందిస్తుందా?అధికార గర్వంతో విర్రవీగుతున్న అధికారులకు అడ్డుకట్ట వేసి, ఏజెన్సీ సంపదను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. యంత్రాంగం ఇప్పటికైనా స్పందించి విచారణ చేపడుతుందో లేదో వేచి చూడాలి.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.